క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో గణపతి హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శనివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గణపతికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాలలో గణపతి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు భక్తులు, ఉభయ దాతలు హోమంలో పాల్గొన్నారు. సంకటహర చతుర్థిన స్వామి వారికి అభిషేకాలు, హోమం జరిపించుకోవడంతో సమస్యలు తొలగిపోయి, చేపట్టిన పనుల్లో విజయం సిద్ధిస్తుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావు, ఏఈవో ఎన్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రమాదకర కేబుల్ వైర్లు తొలగించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపించినా, అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి ఒక వారం రోజుల్లోగా వాటిని తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పౌరుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ నగర సుందరీకరణలో భాగంగా నగర పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎక్కడైనా వేలాడుతూ ఉన్న కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని వెంటనే తొలగించి, అందంగా ఉండేలా పునర్నిర్మించుకోవాలని ఆదేశించారు. ఈ నిబంధనను అమలు చేయకపోతే వారం తర్వాత వీఎంసీ అధికారులు చర్యలు చేపడతారన్నారు. పౌరులు, కేబుల్ ఆపరేటర్లు సహకరించాలని సూచించారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యాన 45 రోజులుగా సాగుతున్న మజ్జిగ వితరణ కార్యక్రమం శనివారం గొల్లపూడి సెంటర్‌లో నిర్వహించిన మజ్జిగ పంపిణీతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు మద్దాళి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు 45 రోజులుగా ప్రతి రోజూ ఓ కూడలిలో దాదాపు మూడు వేల మందికి మజ్జిగ పంపిణీ చేశామన్నారు.

2019 నుంచి నిర్వహణ..

ఆర్యవైశ్య సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా పద్మావతి మాట్లాడుతూ.. 2019 నుంచి ప్రతి ఏడాది గొల్లపూడి కేంద్రంగా మజ్జిగ పంపిణీతో పాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు చెన్నా సాంబశివరావు, పోకూరు గంగాధరరావు, మద్దుల సుబ్రహ్మణ్యం, పారేపల్లి ఆదినారాయణ, అరవపల్లి ప్రసాద్, కొలిశెట్టి రోజా తదితరులు పాల్గొన్నారు.

2,574 కేంద్రాల్లో యోగా శిక్షణ తరగతులు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాలన్నిటిలోనూ ప్రతి సచివాలయానికి 9 కేంద్రాల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తున్న సందర్భంగా ప్రతి సచివాలయంలో 9 కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాల్లో ప్రజలకు యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న 286 సచివాలయాల్లో 2,574 కేంద్రాలలో యోగా డెమోను నిర్వహించామన్నారు.

పటమటలో..

పటమట 10వ డివిజన్‌లోని ఫన్‌టైం క్లబ్‌లో శనివారం యోగాంధ్రలో భాగంగా యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ తంగెళ్లమూడి వీరరాఘవయ్య యోగాలో శిక్షణ ఇచ్చారు. జోనల్ కమిషనర్ షమ్మీ, స్పెషల్ అధికారి సలీం, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

విజయవాడకల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో దాతలు గోయాజ్ సిల్వర్ జ్యూయలరీ, లాడియా జ్యూయలరీస్ ఆధ్వర్యంలో 300 మంది భక్తులకు శనివారం అన్నప్రసాదం అందించారు. తొలుత పద్మావతి సమేత శ్రీనివాసులుకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పూలన్నీ నీ పూజకే స్వామి

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



పుష్పయాగం వీక్షిస్తున్న ఉభయదాతలు, భక్తులు



స్వామివారికి పంచహారతుల సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజైన శనివారం స్వామి వారికి పుష్పయాగం, సాయంత్రం నగరోత్సవ సేవ నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై ఇరుదేవేరులతో కొలువు తీరిన స్వామివారికి భక్తులు వివిధ సుగంధ పరిమళాల పుష్పాలను సమర్పించారు. వివిధ రకాల పుష్పాలను రాశులుగా పోసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఒక్కో పుష్పరాశిని సమర్పిస్తూ పుష్పయాగం చేశారు. పుష్పయాగంలో భాగంగా స్వామి వారికి పంచహారతుల సేవ నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి

స్వామివారిని దర్శించుకున్నారు. రిటైర్డ్ డీసీపీ హరికృష్ణ, ఇరిగేషన్ శాఖకు చెందిన బత్తుల అప్పారావు, కె.లక్ష్మీ భవాని తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిత్య హోమం, మహాశాంతి హోమాలను ఆలయ అర్చకులు జరిపించారు.

కనులపండువగా నగరోత్సవం..

సాయంత్రం శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి నగరోత్సవ సేవ చిట్టినగర్‌లోని ఆలయం నుంచి ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ నగరోత్సవం కనుల పండువగా సాగింది. చిట్టినగర్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, కోమల విలాస్ మీదగా తిరిగి ఆలయానికి చేరింది. దేవస్థాన కమిటీ, ఆహ్వాన కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను మరుపిళ్ళ హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు, రాంపిళ్ల శ్రీనివాసరావు, మరుపిళ్ళ తాతారావు, మాకిన సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బేబీ రాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబీ రాణి అన్నారు. ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీసీ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ ఇంజినీరింగ్ పేరుతో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల పరిస్థితి మరలా మొదటికి వచ్చిందన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ పదవులు బీసీలకు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రంలో జన గణనతో పాటు బీసీ కుల గణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయి నుంచి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పోస్టు కార్డుల ద్వారా సుప్రీంకోర్టుకు తెలియజేస్తామన్నారు. త్వరలోనే ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపడతామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి శ్రీకాంత్, నిడుముక్కల సాంబశివరావు, పాటూరి శ్రీనివాసరాజు, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు పోలంపల్లి రాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్, తన్నీరు శ్రీను, యాదాద్రి తదితరులు పాల్గొన్నారు.

19న దాసాంజనేయ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి వారి ఆలయం హుండీ కానుకల లెక్కింపు ఈనెల 19న జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 9 గంటలకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, సేవా సంఘం సభ్యుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చని చెప్పారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి

- క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించండి: ఈవో శీనానాయక్
- ఆలయ పరిధిలోని పలు అంశాలపై చర్చ



ఏఈవోలు, సూపరింటెండెంట్లతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రంలో ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేయాలని ఈవో శీనానాయక్ చెప్పారు. దుర్గగుడి ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇతర ముఖ్య అధికారులతో ఈవో శనివారం పలు అంశాలపై చర్చించారు. ఇటీవల ఆలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులతో పాటు అంతర్గత బదిలీల అనంతరం బాధ్యతలు తీసుకున్న ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి వారం ప్రధాన ఆలయాల ర్యాంకింగ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోందని, అందరూ కలిసి కట్టుగా పని చేసి ర్యాంకింగ్‌ను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆలయ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో అనేక చోట్ల పనికి రాని సామగ్రిని నెలల తరబడి వదిలేస్తున్నారని, వాటి వల్ల ఆలయంలో ఆధ్యాత్మిక దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా శానిటేషన్, సెక్యూరిటీ వ్యవస్థలపై పరిశీలన ఉండాలన్నారు. దేవస్థాన రవాణా వ్యవస్థపై ఉన్నత స్థాయిలో ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అదే విధంగా సిబ్బంది తప్పనిసరిగా ఈవో, ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

దుర్గాఘాట్‌పై చర్చ

భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్‌పై ఈవో శీనానాయక్ సమావేశంలో చర్చించారు. దుర్గాఘాట్‌లో ఎంత మందికి హాకర్ లైసెన్స్‌లు ఇచ్చామనే అంశాన్ని పరిశీలించడంతో పాటు అక్కడ ఎంత మంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే దానిపై తనిఖీలు చేపట్టాలన్నారు. హాకర్లకు కేటాయించిన స్థలం ఎంత, అద్దె బకాయిలు ఎంత మొత్తంలో ఉన్నాయనే అంశంపై నివేదిక ఇవ్వాలని అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావును ఆదేశించారు.

ప్రొటోకాల్ దర్శనాలపై సమీక్ష

దుర్గగుడికి విచ్చేసే ప్రముఖులకు అమ్మవారి దర్శనంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఈవో సమీక్ష చేశారు. ప్రొటోకాల్ ఎవరికి వర్తిస్తుంది.. ఎవరు సిఫార్సు చేస్తున్నారనే అంశాలను పరిశీలించాలని ఏఈవో ఎన్.రమేష్‌బాబుకు ఆదేశించారు. వీఐపీలు, సినీతారలతో ఫొటోల కోసం సిబ్బందితో పాటు ఆలయంలో పని చేసే వారు కూడా ఎగబడుతూ ఇబ్బందికరంగా వ్యవహరించడం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ప్రముఖులకు, వీఐపీలకు అమ్మవారి చిత్రపటం ఇచ్చే క్రమంలో సంబంధం లేని వ్యక్తులు ఫొటోలు దిగేందుకు ఉత్సాహాన్ని చూపడం సరికాదన్నారు. తిరుమల తరహాలో ఏ విధమైన కట్టుబాటు ఉందో అదే రీతిలో దుర్గగుడిపై అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు వెంకటరెడ్డి, ఎస్.తిరుమలేశ్వరరావు, కె.గంగాధర్, ఎంఎస్ఎల్ శ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆట పరికరాలు ఇలా..ఆడుకునేది ఎలా?

- హరిత బెరంపార్క్‌లో ఆట పరికరాల దుస్థితి
- కొత్తవాటిని ఏర్పాటు చేయాలని పర్యాటకుల డిమాండ్



పాడైపోయిన ఫైబర్ జారుడు బల్ల



మట్టిలో కూరుకుపోయిన మినీ జారుడు బల్ల



తిరగని రంగులరాట్నం



అధ్వానస్థితిలో ఉన్న ఉయ్యాల

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో పిల్లలు సరదాగా ఆడుకునే ఆటపరికరాల దుస్థితి చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. పెద్ద పెద్ద వృక్షాల నీడలో అహ్లాదకర వాతావరణంలో కాస్తంత సేద తీరేందుకు పర్యాటకులు కుటుంబసభ్యులతో కలిసి వస్తుంటారు. ఇక్కడ ఉన్న రెస్టారెంట్ ఎదురుగాగల ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆట పరికరాలను చూస్తే పిల్లలు సహజంగానే ఆడుకునేందుకు ఉత్సాహం చూపిస్తారు. పిల్లలను తీసుకువచ్చే పర్యాటకులు కూడా పిల్లల ఆసక్తిని గమనించి ఆడుకునేందుకు వాటి దగ్గరకు తీసుకువెళతారు. తీరా అధ్వానంగా ఉన్న ఆట పరికరాలను చూసి పిల్లలను వాటి దగ్గరకు వెళ్లకుండా చూస్తున్నారు. ఎందుకంటే ఫైబర్ మెటీరియల్‌తో తయారుచేసిన జారుడు బల్లల్లో ఒకటి ఎండకు ఎండి..వర్షానికి తడిసి పాడైపోయింది. దాని చివర ఫైబర్ మెటీరియల్ పగిలిపోయి ప్రమాదకరంగా తయారైంది. పిల్లలు అదేమీ చూసుకోకుండా ఆడుకుందామని జారుడు బల్ల ఎక్కితే చివరికి వచ్చేసరికి పగిలిపోయిన ఫైబర్ అంచుల దగ్గర వారి దుస్తులు పట్టేసి గాయాలయ్యే అవకాశం ఉంది.

ఏఆట పరికరం చూసినా అధ్వానమే..

మరో మినీ జారుడు బల్ల మట్టిలో కూరుకుపోయి ఉండటంతో చిన్నారుల దుస్తులు చిరిగిపోయే ప్రమాదం ఉంది. ఆరుగురు చిన్నారులు కూర్చుని గిరగిరా తిరిగే రంగుల రాట్నం ఆటపరికరంలో మూడు చోట్ల సీట్లే లేవు. మరొకటి సగం విరిగిపోయి ఉంది. మరో విశేషమేమిటంటే తిప్పితే గిరగిరా తిరగాల్సిన రంగులరాట్నం పరికరం నేలకు ఆనుకుని తిరిగే పరిస్థితి లేదు. ఇక ఐరన్‌బార్‌కు బిగించిన రెండు ఐరన్ కప్లింగ్‌లతో వేలాడే ఉయ్యాల ఆటపరికరానికి ఒక కప్లింగ్ ఊడిపోయింది. దాంతో ఆ పరికరం ఒక పక్కకు ఒరిగిపోయి నేలకు ఆనుకుపోయింది.

మొత్తం మీద బెరంపార్క్‌లో ఉన్న నాలుగు ఆటపరికరాలు ఎందుకూ పనికిరాకుండా పాడైపోయి అధ్వానంగా ఉండటంతో అక్కడికి తల్లిదండ్రులతో కలిసి వచ్చే పిల్లల్లోని ఉత్సాహం నీరుగారిపోయి నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఆడుకునేందుకు వీలు లేకుండా పనికి రాని ఈ ఆట పరికరాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుభాషిణి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మారుతున్న సమాజ అవసరాలు, విద్యార్థుల అభిరుచులు, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనను తీర్చిదిద్దుకోవాలని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ వి.సుభాషిణి అన్నారు. కేబీఎన్ కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యాన శనివారం అధ్యాపక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ.. అధ్యాపకులు విషయ నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, దేశభక్తి తదతర అంశాలకు కూడా స్థానం కల్పించాలన్నారు. తాము పనిచేస్తున్న సంస్థ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకుంటూ విద్యార్థులకు ఉన్నతమైన మార్గదర్శనం చేసే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా, మానవీయ విలువలను బోధించే నేతలుగా, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా ఎలా నిలవాలో పలు అంశాల ఆధారంగా వివరించారు. ముఖ్యంగా విద్యా బాధ్యతలు, నైతిక బోధనాచరణలు, విద్యార్థులతో గాఢమైన పరస్పర సంబంధాలు, విద్యాసంస్థలో సహకారానికీ, వినూత్నతకూ అనువైన వాతావరణ సృష్టి, సంస్థ ప్రమాణాలు, మౌలిక ప్రమాణాల సాధనలో అధ్యాపకుల పాత్ర, భావోద్వేగ మేధస్సు, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అంశాలను ఉదాహరణ పూర్వకంగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ అధ్యాపక వృత్తి సమాజంలో అన్ని వృత్తుల కన్నా గౌరవప్రదమైనదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింలను దగా చేసిన చంద్రబాబు



మాట్లాడుతున్న బాజీ బాబా

వించిపేట(విజయవాడపశ్చిమ): ఎన్నికలకు ముందు హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం మైనార్టీలకు లక్ష రూపాయాలు సబ్సిడీ ఇస్తామని వాగ్దానాలు చేసిన సీఎం చంద్రబాబు నేడు ఆ ఊసే ఎత్తక పోవడం దారుణమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా విమర్శించారు. వించిపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్‌యాత్ర విషయంలో కూడా చంద్రబాబు మాటమార్చి ముస్లింలను దగా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొత్తం 2,873 మంది హజ్‌యాత్రికులకు రూ. 19.52 కోట్లను నేరుగా వారి ఖాతాలలో జమ చేయడంతోపాటు హజ్ క్యాంపు ఖర్చులకు అదనంగా రెండు కోట్ల రూపాయలు విడుదల చేశారని గుర్తుచేశారు.

ఎన్నికల సమయంలో చంద్రబాబు హజ్‌యాత్రికులకు లక్షరూపాయాలు సబ్సిడీ ఇస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హజ్ యాత్రికులకు సబ్సిడీని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

30న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

రామవరప్పాడు: రామవరప్పాడులో ఈ నెల 30వ తేదీన జరగనున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా 10వ మహాసభను విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సాయిబాబా ఆలయం సమీపంలో శనివారం మహాసభలు నిర్వహణ నిమిత్తం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందన్నారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

అధికారంలోకి ఏడాది గడుస్తున్నా నేటికి దాని ఊసే ఎత్తడం లేదన్నారు. జరగబోయే మహాసభల్లో సంక్షేమ బోర్డు పని చేయడం కోసం చేపట్టాల్సిన విధివిధానాలను చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. అనంతరం 21 మందితో కూడిన ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు అప్పారావు, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గోవింద్ బెనర్జి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాత షఫీవుల్లాకు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, రక్తదాత ఎస్‌కే షఫీవుల్లాకు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేశారు. షఫీవుల్లా 48 సార్లు రక్తదానం చేయడంతో సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. షఫీవుల్లాను ట్రస్ట్ సభ్యులు నాగమల్లీశ్వరి, బి. వసంతకుమార్ అభినందించారు.

పద్య నాటక వైభవాన్ని చాటిన హరిశ్చంద్ర నాటకం



సత్యహరిశ్చంద నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, జయంతి నాట్య మండలి సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళా వేదికపై శనివారం ప్రదర్శించిన సత్య హరిశ్చంద నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, మహాకవి జాషువా రచించిన నాటకాన్ని నటీనటులు పాత్రోచితంగా నటించారు. సత్యమే వ్రతంగా నియమం కలిగిన హరిశ్చందుడు ఇచ్చిన మాట కోసం సమస్త రాజ్యాన్ని వదులుకోవడం, చివరకు భార్యబిడ్డలను కూడా అమ్ముకోవడం తదితర అంశాలుగా నాటకం సాగింది. హరిశ్చంద్రునిగా జి.లక్ష్మయ్య, వివేకానంద స్వామి, నక్షత్రకునిగా శివయ్య నాయుడు, చంద్రమతిగా రమణి నటించారు. మహాకవి జాషువా రచించిన కాటిసీను పద్యాలు కరతాళ ధ్వనులందుకున్నాయి.

గురుబ్రహ్మ, గురుశిరోమణి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వివిధ రంగాల్లోని గురువులను గుర్తించి వారిని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ, గురు శిరోమణి పురస్కారంతో సత్కరించనున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబర్ 1-20-164, పోస్టు, తిరుమలగిరి, గోకుల్ నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్- 15కు పంపించాలని కోరారు. 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

కర్నాటి రామ్మోహన్‌రావుకు నివాళి



హైకోర్టు జడ్జి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్‌ను సన్మానిస్తున్న హజరత్తయ్యగుప్తా తదితరులు

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది కర్నాటి రామ్మోహనరావు జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్ మాట్లాడుతూ కర్నాటి రామ్మోహన్‌రావు న్యాయవాది అయినప్పటికీ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. దేశం నలుమూలలా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రిటైర్డ్ హైకోర్టు రిజిస్ట్రార్ తల్లా వేణుగోపాలరావు రామ్మోహన్‌రావు సేవలను కొనియాడారు. సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు మాట్లాడుతూ ఒక్క బెజవాడలోనే కాదు దేశంలో ఎక్కడ మానవ హక్కులకు భంగం కలిగినా రామ్మోహన్‌రావు ముందుండి వారికి న్యాయం జరిగే వరకు పోరాడేవారని వివరించారు. బార్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కర్నాటి వారితో కలిసి ఎన్నో ఉద్యమాలలో పాల్గొనే అవకాశం తనకు దక్కిందన్నారు. జస్టిస్ వీకేఆర్ కృపాసాగర్‌ను సన్మానించారు. కర్నాటి రామ్మోహనరావు శిష్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య కె.వియన్నారావు చెప్పారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేకర్స్ స్పేస్ ల్యాబ్‌ను ఆచార్య వియన్నారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ కొత్త ఆవిష్కరణల వేదికగా విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. దీనిని గొప్ప అవకాశంగా విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు పరిశోధనల దిశగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, ప్రిన్సిపాల్ ఎస్.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలి శాస్త్రి ల్యాబ్ ఇన్‌చార్జి జి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.